
ఏ బ్యాట్రీలేన్ వద్ద ప్రజా పాలన కేంద్రం వద్ద గుమిగూడిన ప్రజలు


గోల్కొండ వార్డు కార్యాలయం వద్ద..


దోర్‌బస్తీలో.. ఫారాలను అందజేస్తున్న కావూరి వెంకటేష్, వినోద్ చౌగ్లే, నర్మద


విక్టరి ప్లేగ్రౌండ్‌లో..

ప్రజా పాలన దరఖాస్తులకు.. విశేష స్పందన

- మొదటి రోజు పోటెత్తిన ప్రజలు
- పలుచోట్ల దరఖాస్తు ఫారాల కొరత
- జిరాక్స్ సెంటర్ల వద్ద క్యూ కట్టిన జనం
- కేంద్రాల్లో పోలీసుల బందోబస్తు


గోల్కొండలోని కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్


దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్


దరఖాస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్


గౌలిపురా మిత్రా క్లబ్‌లో..


దరఖాస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి


దరఖాస్తులను పూర్తి చేసుకున్న మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి రోజే అధిక సంఖ్యలో ఆయా కేంద్రాలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రజలకు సరిపడా దరఖాస్తులను జీహెచ్‌ఎంసీ అధికారులు సమకూర్చలేకపోయారు. ప్రజా పాలన కేంద్రాల వద్దకు ప్రజలు పోటెత్తడంతో దరఖాస్తుల కొరత ఏర్పడింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కేంద్రాలు సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగాయి. ప్రతి డివిజన్‌లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లు అమర్చారు. వచ్చిన దరఖాస్తులన్నీ ఎప్పటికప్పుడు స్వీకరించి రసీదులను అందజేశారు. ఇదిలా ఉండగా దరఖాస్తుల కొరతను ఆసరాగా చేసుకుని దళారులు ఒక్కో ఫారం రూ.50, రూ.100 చొప్పున విక్రయించారు. ప్రజా పాలన కేంద్రాల్లో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. చిన్నపాటి గొడవలు, ఘర్షణలు మినహా మొదటి రోజు ప్రశాంతంగా సాగింది. ప్రజా పాలన కేంద్రాలను ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, స్పెషలాఫీసర్ శ్రీవాత్సవ, ఆర్డీఓ సూర్య ప్రకాష్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌లు వేర్వేరుగా నియోజకవర్గంలోని పలు కేంద్రాలను పరిశీలించారు.

కార్వాన్‌లో..

గోల్కొండ: అర్హులందరి దరఖాస్తు ఫారాలు స్వీకరించబడతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన ప్రజా పాలన సభలు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సులభతరమైన దరఖాస్తులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రంలో


బహదూర్‌పురాలో..

దరఖాస్తులు స్వీకరించడానికి, దరఖాస్తులను పరిశీలించడానికి ప్రత్యేక కౌంటర్లలో సరిపడా సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. గోల్కొండ తహసీల్దార్ అహల్యా, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

24 కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ..

అబిడ్స్: అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ 24 కేంద్రాల్లో చేపట్టారు. గోషామహల్ నియోజకవర్గం 14వ సర్కిల్ కేంద్రంలో ఆరు డివిజన్లలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. గోషామహల్ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ గీతారాధిక, సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్యల పర్యవేక్షణలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడలో ఆరు గ్యారంటీల అభయ హస్తం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గురువారం డబుల్ బెడ్రూం అంబేడ్కర్ కమిటీ హాల్, డోర్‌బస్తీ, ప్రభుత్వ పాఠశాల బిల్డింగ్, ఇమాంపురా కమ్యూనిటీ హాల్‌లో ఆయా బస్తీలకు చెందిన ప్రజలు అభయ హస్తం ఫారాలను తీసుకుని దరఖాస్తు చేశారు. కాగా అధికశాతం ప్రజలు రావడంతో దరఖాస్తు ఫారాలు తక్కువ పడ్డాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావూరి వెంకటేష్, గ్రేటర్ కార్యదర్శి వినోద్‌చౌగ్లే మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారాలు లభించని వారు మరుసటి రోజు కూడా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.

దరఖాస్తుల కొరతతో ప్రజల్లో గందరగోళం..

సుల్తాన్‌బజార్: చాదర్‌ఘాట్ విక్టరి ప్లే గ్రౌండ్, ఫిరోజ్‌గాంధీ పార్క్‌లో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల కొరత ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫిరోజ్‌గాంధీ పార్కు సమీపంలో మోడ్రన్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలనలో ఇన్‌చార్జి ప్రజలపై దురుసుగా ప్రవర్తించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో దరఖాస్తుకు రూ.30 నుంచి రూ.100 వసూళ్లు చేశారు. ఈ క్రమంలో జిరాక్స్ (బ్లాక్ అండ్ వైట్) తీసుకోబడదని పుకారులు షికారులు చేయడంతో దరఖాస్తు దారులు కలర్ జిరాక్స్‌లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు విక్టరి ప్లేగ్రౌండ్, ఫిరోజ్‌గాంధీ పార్కు సెంటర్లలో వందల సంఖ్యల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.

వచ్చే నెల 6 వరకు ప్రజా పాలన..

చార్మినార్: ప్రజా పాలన కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ అన్నారు. గురువారం సుల్తాన్ చాయ్‌లోని ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించారు. అవసరమైన వారికి కొన్ని దరఖాస్తు ఫారాలను స్వయంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు అస్లం ఉల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ కళంధర్‌నగర్‌లో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ కళందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తుల కోసం క్యూ కట్టారు. అనంతరం దరఖాస్తులను పూర్తి చేసిన కొంతమంది ప్రజలు తిరిగి అధికారులకు అందజేశారు. దాదాపు 3 వేల మందికి దరఖాస్తులను అందజేసినట్లు అధికారులు తెలిపారు. సంతోష్ నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్ పాల్గొని దరఖాస్తులను ప్రజలకు అందజేశారు.

గౌలిపురాలో..

గౌలిపురా: ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తుల కౌంటర్లను ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఓంకార్ ప్లే గ్రౌండ్ కమ్యూనిటీ హాల్, హనుమాన్‌నగర్ బస్తీ దవాఖానా, చాపలగల్లీ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పరిశీలించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, నాయకులు కె.రాజ్‌కుమార్, జమాల్‌పూర్ అశోక్, వికాస్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పంపిణీ..

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పథకాలకు దరఖాస్తులను పంపిణీ చేశారు. యాకుత్‌పురా కాంగ్రెస్ నాయకుడు బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు రాకేశ్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, సీనియర్ నాయకులు డల్లు శివ తదితరులు పాల్గొని దరఖాస్తులను అందజేశారు.

బహదూర్‌పురా నియోజకవర్గంలో..

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల వద్ద ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చాలా కేంద్రాల్లో సరిపడ దరఖాస్తులు అందుబాటులో లేకుండా పోయాయి. దీనికి తోడు ఏ పత్రాలు ఎక్కడ సమర్పించాలి..అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు సమర్పించాలి..ఒక్కో పథకానికి ఒక్కో


జాంబాగ్‌లో దరఖాస్తులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు లడ్డు సుభాష్ తదితరులు


ఎస్‌డీ నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తదితరులు

దరఖాస్తు ప్రత్యేకంగా సమర్పించాలా తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యారు. దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది కూడా సరైన అవగాహన లేకపోవడం కనిపించింది. ముస్లింలు ఎక్కువగా ఉండే బస్తీల్లోని కేంద్రాల్లో ఉర్దూ భాషల్లోనే దరఖాస్తులు మాత్రమే లభించాయి. ఇంగ్లిష్, తెలుగులో కావాలనుకున్న వారికి దొరకలేదు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: ప్రజా పాలనలో ఐదు గ్యారంటీలకు సంబంధించి చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో గురువారం దరఖాస్తుల ప్రక్రియకు ప్రజల పెద్ద ఎత్తున తరలివచ్చారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్లు సైతం చదువురాని వారి ఫారాలను దరఖాస్తు చేయించారు. ఉప్పుగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ స్వయంగా చదువురాని వారి దరఖాస్తులను పూర్తి చేశారు.

కాంగ్రెస్, మజ్లిస్ నేతల ఘర్షణ


ఇరు వర్గాలను సముదాయిస్తున్న మొగల్‌పురా పోలీసులు

చార్మినార్: ప్రజా పాలన సందర్భంగా చార్మినార్ నియోజకవర్గ పరిధిలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మజ్లిస్ నాయకులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు మొదటి రోజు ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని వాగ్వాదాలతో మొదలైన ఘర్షణ ఒకరు చేయి చేసుకోవడం వరకు వెళ్లింది. సుల్తాన్ షాహి ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రం వద్ద జరిగిన ఇరు వర్గాల ఘర్షణతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్‌తో పాటు అతని సోదరుడు, కుమారుడికి స్థానిక మజ్లిస్ నాయకులు రాహిల్ నాయకత్వంలోని నాయకులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు నెట్టేసుకుంటూ బూతులు తిట్టుకున్నారు. పరిస్థితి విషమిస్తుండడంతో మొగల్‌పురా పోలీసులు ఇరు వర్గాలను సముదాయించి ఘటనా స్థలం నుంచి పంపించారు. అనంతరం ఇరు వర్గాలు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

జిరాక్స్ సెంటర్లకు బారులు..


గోల్కొండలోని ఓ జిరాక్స్ సెంటర్ ముందు..

గోల్కొండ: గోల్కొండ వార్డు కార్యాలయం, టోలిచౌకీ, కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లోని ప్రజా పాలన సభ కేంద్రాల్లో అధికారులు నామ్‌కే వాస్తేగా స్థానిక నాయకులకు కొన్ని దరఖాస్తు పత్రాలను మాత్రమే ఇచ్చారు. కేంద్రాల వద్ద కొందరు ఏజెంట్లు దరఖాస్తు ఫారాలను జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీలలో లభిస్తున్నాయని చెప్పడం ప్రారంభించారు. ఒక పేజీగల రేషన్ కార్డు జిరాక్స్ రూ.10, రెండు పేజీలు గల దరఖాస్తు ఫారం రూ.20కి అమ్ముడయ్యాయి. కేంద్రంలో అధికారుల వద్ద ఉండాల్సిన దరఖాస్తు ఫారాలు జిరాక్స్ సెంటర్లకు ఎలా చేరాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి


గోషామహల్‌లో ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. కేవలం 24 కేంద్రాల్లో ఏర్పాటు చేయడంతో వేలాది మంది ఎలా దరఖాస్తు చేస్తారని ప్రశ్నించారు. ప్రజలు అవస్థలు పడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. బీజేపీ నాయకులు ఎం.కృష్ణ, కార్పొరేటర్ లాల్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం


కార్వాన్ తాలీమ్ అమ్లాపూర్‌లో.. మధుయాష్కిగౌడ్


వేడుకల్లో కె.వెంకటేశ్ తదితరులు


చార్మినార్ వద్ద.. నిరంజన్ తదితరులు

దూద్‌బౌలి: రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి చైర్మన్ జి నిరంజన్ ఆధ్వర్యంలో చార్మినార్ కట్టడం వద్ద కాంగ్రెస్ పార్టీ 139 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం నిరంజన్ మాట్లాడుతూ..నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి పని చేస్తుందన్నారు. ప్రజా నాయకుడు మాజీ సీఎల్పీ నాయకుడు పి జనార్దన్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కన్నయ్యలాల్, ఓం ప్రకాష్ శర్మ, మూసా, పులిపాటి రాజేష్ కుమార్, దినేష్, ముజాహిద్ హుస్సేన్, వెంకటేష్ ముదిరాజ్, ముజీబుల్లా షరీఫ్, ఆబేది, మాదాసు విజయ కుమార్, జి. శ్రీనివాస్, ఆమేర్ హాష్మి, భాగేందర్ సింగ్, షౌకత్ పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా మోడ్‌లో..

గౌలిపురా: లాల్‌దర్వాజా మోడ్‌లోని నెహ్రూ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. సురేశ్ బాబు, శ్రీనివాస్, హైదర్ అలీ జాఫ్రి, కాశమ్యోని శ్యామ్‌రావు ముదిరాజ్, నవీన్ కుమార్, వికాస్, దినేశ్, శ్రీవాత్సవ్, కృష్ణ యాదవ్, కిశోర్ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీలను పూర్తి చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధు యాష్కీగౌడ్ అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లోని తాలీమ్ అమ్లాపూర్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తుత్తి హామీలు ఇచ్చే నాయకుల పార్టీలను తెలంగాణ ప్రజలు తిరస్కరించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు హామీల ఆచరణ ఇప్పటికే ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరి, అష్మద్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జియాగూడ: ఉరివేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం వెలుగుచూసింది. ఎస్‌ఐ.వేణు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్ స్ట్రీట్ ప్రాంతంలో ఉంటున్న రత్నమ్మ (65) కొంతకాలంగా భర్త లేకపోవడంతో తన అన్నవాళ్ల ఇంట్లో ఉంటుంది. గురువారం ఉదయం ఎంతకి డోర్ తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు కిటికీ బద్దలు కొట్టి చూడగా ఇంట్లో ఇనుపరాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖల ద్వారా గుర్తింపు పొందిన రిక్రూట్మెంట్ ఏజెన్సీ జపాన్ ప్రభుత్వ పథకం-స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్(ఎస్‌ఎస్‌డబ్ల్యూ) కింద జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన హోటల్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ, నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టామ్‌కామ్ సీఈఓ ఓ ప్రకటనలో తెలిపారు. జపాన్ హోటల్ మేనేజ్‌మెంట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను గుర్తించడానికి టామ్‌కామ్ డిసెంబరు 29, 30వ తేదీల్లో మల్లేపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ ఉద్యోగాలకు అర్హత సాధించడానికి అభ్యర్థులు తప్పనిసరిగా హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా లేదా డిగ్రీని కలిగి ఉండాలని తెలిపారు. హోటల్ పరిశ్రమలో అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 22 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పనిచేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు ఎంపిక చేయబడిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించబడుతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 29, 30వ తేదీల్లో జరిగే స్పెషల్ డ్రైవ్‌ను హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 78935 66493, 98496 39539 లలో సంప్రదించాలని కోరారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి నీరజ హరిప్రభల రచించిన ఊహల అల్లికలు, నీరజ కథాకదంబం పుస్తకాల ఆవిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. ఊహలలో అల్లుతూ కవితలు రాయడం అదే సమయంలో కథా సంపుటిని రాయడం ఎంతో మంచి విషయమన్నారు. రచయిత్రి నీరజ రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని అభిలాషించారు. అంతకు ముందు ప్రముఖ గాయని మాధురికృష్ణ ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అయ్యగారి శ్యామసుందరం, అయ్యగారి జయలక్ష్మి శ్యామసుందరం, సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి ఏవీ కృష్ణకుమారి, వంశీ ఆర్ట్స్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు కాదు.. సంక్షేమ పథకాలను అందించండి


నవత్‌పహాడ్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించడమే కాక ప్రజలకు వెంటనే సంక్షేమ పథకాలను అందించాలని మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా డిమాండ్ చేశారు. బిర్లామందిర్ నవత్‌పహాడ్ ప్రాంతంలో దరఖాస్తుల కేంద్రాన్ని ఆమె పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ..ముందుగా పాత దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. లక్షలాది మంది గతంలో డబుల్‌బెడ్‌రూమ్‌ల కోసం, రేషన్‌కార్డుల కోసం, ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పాత దరఖాస్తులు చేసుకున్నవారందరికి లబ్ధి పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ప్రజలకు రూ.500 లకే సిలిండర్, 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా అందించనిచో తమ బీఆర్‌ఎస్ తడాఖ చూపిస్తామని మమతా గుప్తా హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వేడుకలు


పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్‌టీ చారి, శేషాచార్యులు, బద్రినాథ్, రంగనాథచార్యులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో ధనుర్మాస వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నమ్మాళ్వార్ పరమపదోత్సవం, దేవేరుల పల్లకీ సేవా, హారతి, 9 రకాల ప్రసాదాల వితరణ, రాపత్తు ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అలాగే జనవరి 14న గోదా రంగనాథస్వామి వారికి అభిషేకం, కల్యాణ మహోత్సవం, తీర్థప్రసాద ఘోష్టి, 16న సాయంత్రం గోదా అమ్మవారి కరినోము ఉత్సవం, ధనుర్మాస ఉత్సవ ధనుర్మాసం రథ సమాప్తి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు తెలిపారు.

ఘనంగా కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు


ఉత్సవాల్లో జగ్గారెడ్డి, జితేందర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో అఖిల భారత కాంగ్రెస్ ముఖ్య భూమికను పోషించిందని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ సేవా దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ నుంచి నాంపల్లి, పబ్లిక్‌గార్డెన్, రవీంద్రభారతి ప్రాంతాల మీదుగా నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు శాంతి యాత్రను నిర్వహించారు. అనంతరం జితేందర్ మాట్లాడుతూ..మహాత్మాగాంధీ, నెహ్రూ వంటి ఎందరో మహనీయులు పని చేసిన కాంగ్రెస్ సేవాదళ్‌లో తాను పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వనామ వెంకటేశ్వర్‌రావు, 33 జిల్లాలకు చెందిన కాంగ్రెస్ సేవా దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘దివ్యాంగులకు అండగా ఉంటా’

గోల్కొండ: దివ్యాంగులు, వృద్ధులకు అండగా ఉండి ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని ప్రజా పాలన కేంద్రం వద్ద వీల్‌చైర్‌పై ఉన్న ఓ మహిళను కలుసుకొని ఆమె సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ లభించిందన్నారు. అయితే ఇప్పటి వరకు ఆసరా పింఛన్ పొందుతున్న వారు కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే దివ్యాంగులు తమ సదరం నెంబర్‌ను దరఖాస్తు ఫారంలో తప్పకుండా రాయాలని ఆయన సూచించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏకు మార్చండి



అబిడ్స్: ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూప్‌కు మార్చాలని ముదిరాజ్ సంఘం గ్రేటర్ నాయకులు ఆలేటి సురేష్ ముదిరాజ్, డీఏ శంకర్ ముదిరాజ్, సాయికిరణ్ తేజ ముదిరాజ్, ఆదిత్య ముదిరాజ్ పేర్కొన్నారు. ముదిరాజ్ భవన నిర్మాణానికై రాష్ట్ర ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూప్‌కు మార్చాలని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శాసన మండలిలో చర్చ జరిపి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ముదిరాజ్ కులస్తులకు బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చే విధంగా కృషి చేయాలన్నారు.

పీజేఆర్ ఆశయ సాధనకు కృషి చేయండి


పీజేఆర్‌కు నివాళులర్పిస్తున్న చైర్మన్ జితేందర్ సింగ్

అబిడ్స్: దివంగత పీజేఆర్ ఆశయాలు యువత అభివృద్ధికి దోహదపడుతాయని ప్రముఖ విద్యావేత్త, రిలయన్స్ విద్యాసంస్థ చైర్మన్ జితేందర్ సింగ్ పేర్కొన్నారు. పీజేఆర్ వర్ధంతిని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జితేందర్ సింగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..పేద ప్రజల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత నాయకుడు పీజేఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కార్మికుల అభ్యున్నతి కోసం పీజేఆర్ నిరంతరం తపించారని ఆయన అన్నారు.

బాలుడి అదృశ్యం


బన్ని (ఫైల్)

అబిడ్స్: ఇంటి నుంచి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. మంగళ్‌హాట్ గుఫానగర్‌లో నివసించే కె.బన్ని(14) ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లాడు. ఈనెల 23న మధ్యాహ్నం 2 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన బన్ని అదృశ్యం కావడంతో ఆయన తల్లి శాంత మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ అస్లాం కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని అదృశ్యమైన బన్ని ఆచూకి కోసం గాలిస్తున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్‌లో, బస్‌స్టేషన్లలో బన్ని కోసం పోలీసులు గాలింపులు చేపట్టారు. బ్లూ కలర్ జీన్స్, బ్లూ, వైట్ కలర్ టీ షర్ట్ ధరించిన బన్ని ఆచూకి లభిస్తే 87126 60495లో సంప్రదించాలని పోలీసులు కోరారు.